ఘనంగా మారుబోనం



గౌలిపురా: బోనాల ఉత్సవాల్లో భాగంగా గౌలిపురా రాంసింగ్‌బడా ప్రాంతంలోని బంగారు మైసమ్మ మహంకాళి ఆలయంలో మంగళవారం మారుబోనం కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విజయ్ పోతరాజు ఆధ్వర్యంలో 15 మంది పోతరాజులు, 12 మంది బోనాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ శంకర్ యాదవ్, అధ్యక్షులు పి.సురేశ్ యాదవ్, కె.శ్రీకాంత్ ముదిరాజ్, కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

స్విమ్మింగ్ పోటీల్లో సత్తా



గెలుపొందిన క్రీడాకారులతో కోచ్ జాన్ సిద్ధిఖి తదితరులు

గన్‌ఫౌండ్రీ: అహ్మదాబాద్‌లో జరుగుతున్న 51వ జూనియర్ జాతీయ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో నగర క్రీడాకారులు సత్తాను చాటారు. బాలుర 200 మీటర్ల విభాగంలో సుహాస్ ప్రీతమ్ సిల్వర్ మెడల్‌ను గెలుచుకోగా బాలికల 400 మీటర్ల విభాగంలో నిత్యసాయి బ్రాంజ్ మెడల్‌ను సాధించింది. ఈ సందర్భంగా కోచ్ జాన్ సిద్ధిఖి మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్రం తరఫున పతకాలను గెలుచుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.

రేపు సిటీ పోలీస్ హెడ్ క్వార్టర్‌లో వేలం

చార్మినార్: పేట్లబురుజులోని సిటీ పోలీస్ హెడ్ క్వార్టర్స్ కార్యాలయం వద్ద ఈనెల 7న పాత వస్తువులను వేలం వేయనున్నట్లు సంబంధిత డీసీపీ రక్షిత కృష్ణమూర్తి ఓ ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 11 గంటలకు ప్రారంభం కానున్న ఈ వేలంలో వివిధ రకాల పాత ఐరన్, ఏసీలు, టెంటు, చైర్స్, ఫర్నిచర్, హెల్మెట్లు, ఎయిర్ కూలర్లు, ప్లాస్టిక్ చైర్లను వేలం వేయనున్నామన్నారు. వివరాల కోసం స్టోర్ ఇన్‌స్పెక్టర్ రవిని 8712661326లో సంప్రదించవచ్చు.



మురికికుంటగా మారిన అహ్మద్‌నగర్ నాలా



బుల్కాపూర్ నాలా వద్ద కూలిన ఫెన్సింగ్

నాలాల నిర్వహణపై నిర్లక్ష్యమేల?

- షేక్‌పేట్‌లో అధ్వానంగా నాలాల నిర్వహణ
- పేరుకుపోతున్న వ్యర్థాలు
- పలుచోట్ల నాలాలకు ఫెన్సింగ్ లేని వైనం
- పట్టించుకోని సంబంధిత అధికారులు

గోల్కొండ: షేక్‌పేట్ బుల్కాపూర్ నాలా, అహ్మద్‌నగర్ నాలాతోపాటు గుడిమల్కాపూర్ నాలాల నిర్వహణ అధ్వానంగా తయారయ్యింది. చిన్నపాటి వర్షానికే నాలాల్లో వర్షపు నీరు నిండి పొంగిపొర్లుతున్నాయి. అధికారులు నాలాలో పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించి నాలా గట్టుమీదనే వేస్తున్నారు మట్టిని మాత్రం తొలగించడం లేదు. దీంతో వర్షాల వల్ల పిచ్చి మొక్కలు, మళ్లీ నాలాలోకే వచ్చి చేరుతున్నాయి. షేక్‌పేట్ నుంచి హకీంపేట్ మీదుగా ప్రవహించే బుల్కాపూర్ నాలా అత్యంత ప్రమాదకరంగా మారింది. ఈ నాలాకు పలు ప్రాంతాల్లో ఫెన్సింగ్ లేకపోవడం వల్ల వర్షపు నీటికి తోడుగా నాలాలోని వ్యర్థాలు ఇరుకైన రోడ్ల మీదకు వచ్చి చేరుతున్నాయి. అదే విధంగా మాసాబ్‌ట్యాంక్ అహ్మద్‌నగర్ నాలా నిర్వహణ వ్యర్థాలతో మురికికుంటగా మారింది. గత నెలలో అహ్మద్‌నగర్ నాలాలో తీసిన పూడికలు నాలా పక్కనే గుట్టలుగా పడి ఉన్నాయి. వీటిని తొలగించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు.

దుర్గంధం వెదజల్లుతున్న నాలాలు...

షేక్‌పేట్ బీజేఆర్‌నగర్, హకీంపేట్ కుంట, హకీంపేట్ తదితర ప్రాంతాల్లో నాలాలో పేరుకుపోయిన వ్యర్థాలు కుళ్లిపోయాయి. గుర్తుతెలియని వ్యక్తులు నాలాలో మృతి చెందిన జంతువుల కళేబరాలు సైతం డంపింగ్ చేస్తున్నారు. దీంతో నాలా నుంచి దుర్గంధం వస్తుందని స్థానికులు అంటున్నారు. నాయకులు, అధికారులు నాలాలను సందర్శించి వెళ్తున్నారు తప్పా నాలాల పూడికతీత పనులు మాత్రం చేపట్టడం లేదు. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నాలాల్లో నీరు ముందుకు కదలడం లేదు. నాలాలు దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారుతున్నాయని పలువురు వాపోతున్నారు. ఏదేమైనా అధికారులు చిత్తశుద్ధితో నాలాలకు సరైన ఫెన్సింగ్ ఏర్పాటు చేసి వాటిలో పేరుకుపోయిన మట్టిని తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

నామమాత్రంగా పూడికతీత..



షేక్‌పేట్ బుల్కాపూర్ నాలాలో పూడికతీత పనులు నామమాత్రంగా జరుగుతున్నాయి. తొలగించిన వ్యర్థాలు, పిచ్చి మొక్కలను తరలించకుండా నాలా గట్టుమీదనే వేస్తున్నారు. అధికారులు ఎప్పుడు కూడా కాంట్రాక్టర్ల కోసమే పని చేస్తున్నారు తప్పా పేద ప్రజల కోసం ఆలోచించడం లేదు.

– బాలరాజు, షేక్‌పేట్

పాతబస్తీలో సందడే..సందడి

- పర్యాటక ప్రాంతాలకు సందర్శకుల తాకిడి
- మ్యూజియాలకు పెరుగుతున్న ఆదరణ
- తప్పని ట్రాఫిక్ తిప్పలు

చార్మినార్: ప్రపంచ పర్యాటక ప్రాంతమైన పాతబస్తీలో సందర్శకుల సందడి రోజు రోజుకూ పెరుగుతోంది. పెరుగుతున్న సందర్శకుల సంఖ్యకు అనుగుణంగా తగిన ఏర్పాట్లు కూడా అందుబాటులో ఉంటున్నాయి. దీంతో పాతబస్తీలోని పర్యాటక ప్రాంతాలను సందర్శించడానికి దేశ, విదేశీ పర్యాటకులు ఎక్కువగా మక్కువ చూపుతున్నారు. ముఖ్యంగా సెలవు రోజులతో పాటు వీకెండ్‌లలో సందర్శకుల సంఖ్య సాధారణ రోజుల కన్నా..అధికంగా ఉంటోంది. ఇప్పటికే పాతబస్తీలోని మ్యూజియాలు ప్రపంచ పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. సాలార్‌జంగ్ మ్యూజియం, హెచ్‌ఇహెచ్ నిజాం మ్యూజియం, చౌమహల్లా ప్యాలెస్ తదితర మ్యూజియాలు పర్యాటకులను మంత్రముగ్ధులను చేస్తున్నాయి. విజ్ఞానంతో పాటు వినోదాన్ని కలిగిస్తుండడంతో పాతబస్తీలోని మ్యూజియాలకు పర్యాటకుల తాకిడి ఎక్కువైంది. దీంతో ప్రతిరోజూ దేశ, విదేశాల పర్యాటకులు ఈ మ్యూజియాలను సందర్శిస్తున్నారు. రాష్ట్ర పర్యాటక శాఖ అందజేస్తున్న వివిధ ప్యాకేజీలు పర్యాటకులకు ఊరట కలిగిస్తున్నాయి. సందర్శకుల సందడి పెరగడంతో ఇక్కడి వ్యాపారాలు సైతం జోరుగా కొనసాగుతున్నాయి. ఇక బాటిల్ నెక్ రోడ్లలో ట్రాఫిక్ తిప్పలు తప్పడం లేదు.



సాలార్‌జంగ్ మ్యూజియం



చార్మినార్ వద్ద..



గుల్జార్‌హౌజ్ వద్ద తప్పని ట్రాఫిక్ తిప్పలు

వైభవంగా ఆలయ బ్రహ్మోత్సవాలు



రాహుల్‌దాస్ బాబా చేతులమీదుగా ధ్వజారోహణ కార్యక్రమం

విజయనగర్‌కాలనీ: దాయిబాగ్‌లోని హనుమాన్ బాలాజీ ఆలయంలో బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ పూజల్లో ప్రారంభ ఘట్టమైన గరుడ ధ్వజారోహణ కార్యక్రమాన్ని వీర రాఘవ రామాలయం పండితులు రాహుల్‌దాస్ బాబా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో ముఖ్య ఘట్టమైన శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి కల్యాణం బుధవారం ఉదయం 11 గంటలకు వేదపండితులు వేదాంతం రాజనర్సింహాచార్యులు, గోవర్ధన్ కార్తిక్ ఆచార్య ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు బ్రహ్మోత్సవ కమిటీ అధ్యక్షుడు గొరిగె శ్రీనివాస్ తెలిపారు. ట్రస్ట్ సభ్యులు సామల శ్రీనివాస్, బి.రమేష్‌కుమార్, దాస శ్రీనివాస్, శ్రీనివాస్, అంజయ్య యాదవ్, సుదర్శనం పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్, కార్పొరేటర్ వసీవుద్దీన్

యాకుత్‌పురా: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ అన్నారు. మంగళవారం ఆయన రెయిన్ బజార్ కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్‌తో కలిసి ఎస్‌ఆర్టీ కాలనీ, ఇమామ్ బాడ, అజ్మాత్ నగర్ ప్రాంతాల్లో పర్యటించారు. సుమారు రూ.24 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఆదేశాల మేరకు పాదయాత్రలు నిర్వహిస్తూ ప్రజలకు ఎలాంటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. డివిజన్‌లోని నూతన సీసీ రోడ్డు, తాగునీటి, డ్రైనేజీ పైప్‌లైన్ పనులకు శ్రీకారం చుట్టామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

ప్రపంచ స్థాయి పోటీకి యువతను సిద్ధం చేయాలి

చార్మినార్: ప్రపంచ స్థాయి పోటీకి యువతను సిద్ధం చేయాలని ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ జి. బాలకిష్టారెడ్డి అన్నారు. సిటీ కాలేజ్, కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగం అప్రెంటిషిప్ ఎంబెడెడ్ డిగ్రీ ప్రోగ్రాంలపై నిర్వహిస్తున్న ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జాతీయ విద్యావిధానం-2020 భారత విద్యారంగంలో గేమ్‌చేంజర్‌గా నిలిచిందన్నారు. రిటైర్డ్ ఐఏఎస్ రెడ్డి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ..ఏఈడీపీ ప్రోగ్రాముల ప్రాముఖ్యతను వివరించారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.బాల భాస్కర్, ఐపీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ మూర్తి, కాలేజీ ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ డా.జె.నీరజ, కార్యక్రమ సమన్వయకర్తలు డాక్టర్ మల్లికార్జున్, డాక్టర్ ఝాన్సీ, డాక్టర్ రవీంద్ర, ఇఫత్ ఉన్నీసా తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బాలకిష్టా రెడ్డి

నియామకాలు త్వరితగతిన పూర్తి చేయాలి

సుల్తాన్‌బజార్: వైద్య ఆరోగ్య శాఖలో పారా మెడికల్ పోస్టుల రిక్రూట్‌మెంట్‌లు త్వరగా పూర్తిచేయాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ కార్యదర్శి భూపాల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కోఠిలోని మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు కార్యాలయం వద్ద ధర్నాను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వైద్య ఆరోగ్య శాఖలో ఖాళీ పోస్టులను భర్తీ చేపట్టడం ఎంతో అభినందనీయమన్నారు. గత ప్రభుత్వ కాలంలో పెండింగ్‌లో ఉన్న రిక్రూట్‌మెంట్స్ కొన్ని క్యాడర్లు భర్తీ కూడా చేశారన్నారు. ప్రస్తుతం గత 2024 సెప్టెంబర్‌లో పారా మెడికల్ పోస్టులు భర్తీ చేపట్టారని వాటిలో ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్-2 (1284 పోస్టులు), నర్సింగ్ ఆఫీసర్స్ 2322 పోస్టులు, ఫార్మసిస్ట్ గ్రేడ్-2 (732) పోస్టులు గత ప్రభుత్వ కాలంలో ఎంపీహెచ్‌ఏ ఫీమేల్ పోస్టులు 1931 మొత్తం 6269 పోస్టులకు రిక్రూట్‌మెంట్‌ను త్వరగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కానీ ఈ రిక్రూట్‌మెంట్‌లో రిటర్న్ ఎగ్జామ్ పూర్తి చేసి కీ విడుదల చేశారు కానీ ప్రొవిజినల్, ఫైనల్ మెరిట్ లిస్టులను విడుదల చేసి త్వరగా రిక్రూట్‌మెంట్ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎండీ ఫసియుద్దీన్, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

బాక్సింగ్‌కు పెరుగుతున్న ఆదరణ

గోల్కొండ: బాక్సింగ్‌కు రోజు రోజుకూ ఆదరణ పెరుగుతుందని ప్రముఖ బాక్సింగ్ కోచ్ షేక్ ఏజాజ్ అహ్మద్ చాంద్ అన్నారు. మంగళవారం గోల్కొండ ఒవైసీ స్పోర్ట్స్ కంప్లెక్స్‌లో జూనియర్, సీనియర్ బాలికల శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాల స్థాయి నుంచే కళాశాల స్థాయి వరకు బాలికలు యువతులు బాక్సింగ్ నేర్చుకోవడానికి మొగ్గు చూపుతున్నారన్నారు. ప్రభుత్వం ప్రతి మండల కేంద్రానికి బాక్సింగ్ కోసం ప్రత్యేక భవనాన్ని కేటాయించాలని కోరారు.



శాస్త్రీయ కళలను భవిష్యత్ తరాలకు అందించాలి



నృత్య గురువులకు పురస్కారాలను అందజేస్తున్న శిరీషరెడ్డి తదితరులు

గన్‌ఫౌండ్రీ: శాస్త్రీయ కళలను భవిష్యత్ తరాలకు అందించాలని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. మంగళవారం ఆదర్శ్‌నగర్‌లోని బిర్లా సైన్స్ సెంటర్‌లో మెగా హెల్పింగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో రాణిస్తున్న పలువురికి కీర్తిరత్న, ఐకానిక్ అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ ఎం.శంకర్ మాట్లాడుతూ..వివిధ రంగాల్లో సేవలందిస్తున్న వారిని గుర్తించి పురస్కారాలను అందజేయడం ఎంతో అభినందనీయమన్నారు. అంతకు ముందు చిన్నారుల సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ కమిషన్ పూర్వ సభ్యులు ఎం.రామ్‌నాయక్, సినీ నటులు సూర్యప్రసాద్, జ్వాలా చక్రవర్తి, దర్శకుడు రుద్ర శ్రీనివాస్, నిశాంత్ శర్మ, రాజేష్ శ్యామల, ఫౌండేషన్ వ్యవస్థాపకులు శిరీషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జియాగూడ అభివృద్ధికి కృషి

జియాగూడ: జియాగూడ అభివృద్ధికి కృషి చేస్తున్నానని కార్పొరేటర్ బోయిని దర్శన్ అన్నారు. మంగళవారం ఇమాంపురా నవభారత సంఘం అధ్యక్షుడు మధిర సత్యనారాయణ ఆధ్వర్యంలో సీసీ రోడ్డు పనులకు హాజరై పనులు ప్రారంభించారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ..మూసీ నది దోమల నివారణకు చర్యలు తీసుకోవడంతో పాటు జియాగూడ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం కోశాధికారి ఎం.మహేష్‌బాబు, సభ్యులు జి.మహేందర్, పురుషోత్తం, కిశోర్‌కుమార్, దర్శన్, రాజకుమార్, రాజేందర్, సత్యనారాయణ, మురళి, మనీష్‌జైన్ తదితరులు పాల్గొన్నారు.




సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ దర్శన్, సత్యనారాయణ

కౌన్సెలింగ్‌తో కలహాలకు చెక్

గోల్కొండ: కుటుంబ తగాదాలు, దంపతుల మధ్య కలహాలను కౌన్సెలింగ్‌తో చెక్ పెట్టవచ్చునని తెలంగాణ ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఆర్గనైజేషన్ చైర్మన్ మహ్మద్ నజీబ్ అన్నారు. మంగళవారం ఆయన టోలిచౌకీ అక్బర్‌బాగ్‌లోని తన కార్యాలయంలో సంగారెడ్డి, బేగంపేట్ నుంచి వచ్చిన వారికి ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా ఆయన వారికి టీఎఫ్‌సీవో సభ్యత్వ నమోదు పత్రాలను అందజేశారు. 15 ఏళ్ల తాము ఆర్గనైజేషన్ కార్యకలాపాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటి వరకు వేలాది మంది జంటలకు కౌన్సెలింగ్ నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో కల్యాణి, బసవేశ్వర్, ప్రసాద్ తదితరులున్నారు.



టీ ఎఫ్‌సీవో సభ్యత్వ పుస్తకాన్ని అందజేస్తున్న మహ్మద్ నజీబ్



ప్రేమ వ్యవహారంలో యువకుడిపై దాడి..

చికిత్స పొందుతూ మృతి



గౌతమ్ ఠాకూర్

సంతోష్‌నగర్: అమ్మాయి ప్రేమ వ్యవహారంలో ఓ యువకుడిపై దాడి చేయడంతో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన ఐ.ఎస్.సదన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..పోచమ్మగడ్డ ప్రాంతానికి చెందిన గౌతమ్ ఠాకూర్ (27) వృత్తిరీత్యా డ్రైవర్. సుల్తాన్ హల్వా ప్రాంతానికి చెందిన రాము అమ్మాయి విషయంలో గౌతమ్‌తో గొడవ పడ్డాడు. గత నెల 12న రాము అతని అనుచరులతో కలిసి గౌతమ్ ఇంటిపై దాడి చేశాడు. ఈ దాడిలో తీవ్ర గాయాలకు గురైన గౌతమ్‌ను కుటుంబసభ్యులు ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. గౌతమ్ మృతికి కారణమైన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మృతదేహాన్ని తరలించే వాహనాన్ని ఐ.ఎస్.సదన్ చౌరస్తాలో అడ్డుకొని నినాదాలు చేస్తూ ధర్నాకు ప్రయత్నించారు. పరిస్థితి ఉద్రిక్తతగా మారడంతో ఐ.ఎస్.సదన్ పోలీసులు స్వల్పంగా లాఠీచార్జి చేసి యువకులను చెదరగొట్టారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


ఉపాధ్యాయుల వర్క్‌షాప్



అబిడ్స్: ఉపాధ్యాయుల కోసం విద్యాశాఖ వర్క్‌షాప్ నిర్వహించింది. విద్య పరిశోధన శిక్షణ మండలి జామ్ ఫౌండేషన్‌తో కలిసి వర్క్‌షాప్ చేపట్టింది. త్వరలోనే విద్యాశాఖ కొత్తగా ప్రారంభించే 1 నుంచి 9వ తరగతి వరకు డిజిటల్ లెర్నింగ్ పాఠ్య పుస్తకాలను సమర్థవంతంగా అమలు చేయడానికి ఈ వర్క్‌షాప్ దోహదపడుతుందని అధికారులు పేర్కొన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఒకే అనుభవ పూర్వక మాడ్యూల్‌లను యాక్సెస్ చేసేందుకు బోధించారు.

ఎమ్మెల్సీ కవితకు సంఘీభావం

అబిడ్స్: బీసీలకు స్థానిక సంస్థల్లో, విద్యా ఉద్యోగాల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్ సాధించేందుకు తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ నాయకులు పప్పు మాత్రే, జాగృతి రాష్ట్ర నాయకులు శ్రీనివాస్ పేర్కొన్నారు. బీసీ రిజర్వేషన్ల కోసం ఇందిరాపార్కు వద్ద నిరాహార దీక్ష చేస్తున్న ఎమ్మెల్సీ కవితకు వారు సంఘీభావం ప్రకటించారు. అనంతరం మాట్లాడుతూ..రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చేంత వరకు తమ ఆందోళనలు కొనసాగుతాయన్నారు. సీఎం రేవంత్ రెడ్డి గత అసెంబ్లీ ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చడం లేదన్నారు. వెంటనే బీసీ వర్గాలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, లేనిచో తమ ఉద్యమం పెద్ద ఎత్తున చేపడుతామన్నారు.



ఎమ్మెల్సీ కవితకు సంఘీభావం ప్రకటించిన పప్పుమాత్రే, శ్రీనివాస్

నిలోఫర్‌ను సందర్శించిన మాజీ ఎమ్మెల్యే



నాంపల్లి: మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్ రెడ్డి మంగళవారం నిలోఫర్ ఆసుపత్రిని సందర్శించారు. ఆలయ ప్రాంగణంలోని బంగారు లక్ష్మమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అక్కడ ప్రత్యేక పూజలు చేశారు. నిలోఫర్ ఆసుపత్రి సిబ్బంది శ్రీనివాస్, డి.రవి బృందం మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్ రెడ్డికి ఆలయంలో ఘనంగా స్వాగతం పలికారు. ఈ నెల 19న జరిగే బోనాల వేడుకలకు హాజరుకావాలని ఆయనకు ఆహ్వానం పలికారు.

దరఖాస్తుల ఆహ్వానం

శాలిబండ: కులీ కుతుబ్‌షా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో అడ్మిషన్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ పి.పరమేశ్వరి, అసిస్టెంట్ కో ఆర్డినేటర్ వంశీ విక్రం తెలిపారు. ఈ నెల 5 నుంచి దరఖాస్తుల అందజేతతో పాటు దర ఖాస్తులను స్వీకరిస్తున్నామన్నారు. సివిల్ ఇంజినీరింగ్‌లో 28 సీట్లు, మెకానికల్ ఇంజినీరింగ్‌లో 28 సీట్లు, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్‌లో 12 సీట్లు, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్‌లో 22 సీట్లు, ప్రింటింగ్ టెక్నాలజీ లో 40 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. 8వ తేదీన ఉదయం 11 గంటలకు స్పాట్ అడ్మిషన్‌ను నిర్వహిస్తామన్నారు.

వర్షాకాలంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి



టోలిచౌకీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే కౌసర్, అధికారులు

గోల్కొండ: వర్షాకాలంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. మంగళవారం ఆయన టోలిచౌకీ నానల్‌నగర్, గోల్కొండ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. హకీంపేట్‌లోని బుల్కాపూర్ నాలాను పరిశీలించి నాలాలో మట్టిని తొలగించే పనులు త్వరలోనే ప్రారంభమవుతాయన్నారు. అనంతరం టోలిచౌకీ చౌరస్తా వద్ద జరుగుతున్న బాక్స్ టైప్ డ్రైనేజీ పనులను పరిశీలించారు. చౌరస్తా వద్ద వర్షపు నీరు ఎందుకు నిలిచిపోతుందో పరిశీలించి అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను కోరుతానన్నారు. అలాగే నదీమ్ కాలనీ లోతుట్ట ప్రాంతాల్లో ఉన్న ఇళ్లల్లో వర్షపు నీరు రావడం గురించి స్థానికులతో మాట్లాడారు. త్వరలోనే తాను వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి అవసరమైన సలహాలు, సూచనలు ఇస్తానన్నారు. బల్దియా అధికారులు, నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, సీనియర్ నాయకులు హారూన్‌ఫరాన్, అలీముద్దీన్ తదితరులున్నారు.